పొంచి ఉన్న ప్రమాదం

- కొండరాళ్లు ఎప్పుడు జారిపడతాయోనని స్థానికుల భయాందోళన
- చినుకు పడితే కంటిమీద కునుకు ఉండదు
- ప్రమాదం జరిగినప్పుడు తప్ప కనిపించని అధికారులు, ప్రజాప్రతినిధులు


ఇటీవల వర్షాలకు వీరయ్యవీధిలో రాళ్లు దొర్లి దెబ్బతిన్న నివాసం

విందిపేట(విజయవాడపశ్చిమ): నగరంలోని పశ్చిమ నియోజకవర్గంలో అత్యధిక మంది పేద, మధ్య తరగతి ప్రజలు కొండ ప్రాంతాలలోనే నివాసం ఉంటున్నారు. వేలాది రూపాయల అద్దెలు చెల్లించుకోలేక వారు దశాబ్దాలుగా కొండ ప్రాంతాలలో నివాసాలను ఏర్పాటు చేసుకుని కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు. నియోజకవర్గంలోని 49, 50, 55 డివిజన్‌లు కొండ ప్రాంతంలోనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజలు నివాసముంటున్నారు. అత్యధిక జనాభా ఉండే కొండ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో వారు అనేక సమస్యలతో నిత్యం సతమతమవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వారి అవస్థలు అన్నీఇన్నీ కావు. ఎప్పుడు కొండరాళ్లు, మట్టిచరియలు జారి తమ నివాసాల మీద పడతాయోనని కంటి మీద కునుకు లేకుండా గడపాల్సిన పరిస్థితి నెలకుంటోందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా రిటైనింగ్ వాల్స్...

ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతాలలో అనేక చోట్ల రిటైనింగ్ వాల్స్ జారి కింద ఉన్న ఇళ్లపై పడటంతో ఆ ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా చిన్నపాటి వర్షానికే 50వ డివిజన్‌లోని నూకాలమ్మగుడి వీధి, 49వ డివిజన్‌లోని జగుపిళ్ల రామారావు వీధి, వందనంవారి వీధి, వీరయ్య వీధి కొండ ప్రాంతాల్లో అనేక నివాసాల సమీపంలోని


కొండ ప్రాంతంలో వీరయ్యవీధి అడ్డరోడ్డులో ఇంటి అడుగుభాగం జారిపోయి ప్రమాదకరంగా ఉన్న నివాసం

కొండరాళ్లు, మట్టిచరియలు జారిపడుతున్నాయి. వర్షాలు ఇలాగే ఎడతెరిపి లేకుండా కురిస్తే కొండ చరియలు జారి కింద ఉన్న ఇళ్లపై పడి భారీగా ఆస్తి, ప్రాణనష్టం కూడా జరిగే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప...

కొండ ప్రాంతాలలో ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ప్రాంతాలకు రారని స్థానికులు వాపోతున్నారు. రిటైనింగ్ వాల్స్ సమస్యలపై


బొల్లెద్దు పెంటయ్య నివాసం వద్ద ప్రమాదకరంగా జారిన మట్టిచరియలు

అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ముందస్తు భద్రత చర్యలు చేపట్టకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రెండు చోట్ల కొండచరియలు జారి పడి ఇళ్లు ధ్వంసం అయిన ఘటనలు ఇంకా కళ్ల ముందే మెదులుతున్నాయని, మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకోక ముందే అధికారులు ఆయా ప్రాంతాలలో పర్యటించి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలలో రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం


చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఎప్పుడు ఏ రాళ్లు తమ ఇంటిమీద పడతాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాం. ఇప్పటికే మా ఇంటి వెనుక వర్షాలకు చెట్లు, మట్టి కిందికి జారిపడుతున్నాయి. అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాం.

– గోసాల దుర్గమ్మ, స్థానికురాలు

కొండ ప్రాంతంలో అన్నీ సమస్యలే....


పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివాసముండే కొండ ప్రాంతాలు అంటే అధికారులు, ప్రజా ప్రతినిధులకు చిన్నచూపు. ఇక్కడ నిత్యం అనేక సమస్యలతో మేము ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలలో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం చేయాలి.

– మాత్రపు కోటిరామ్మూర్తి, స్థానికుడు

పూర్ణాహుతితో ముగిసిన చవితి ఉత్సవాలు

సాయంత్రం గణపతి విగ్రహ నిమజ్జనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాలు శుక్రవారంతో పరిసమాప్తమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని నటరాజ స్వామి వారి ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ వైదిక కమిటీ నిర్వహించింది. పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, శ్రీధర్‌లతో పాటు పలువురు అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణం నుంచి గణపతి నిమజ్జన ఊరేగింపు ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ అధికారులు, సిబ్బంది గణపతి విగ్రహాన్ని ఊరేగించి ఆలయ ప్రాంగణంలోనే నిమజ్జనం చేశారు.


పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ, ఈవోలు

22 నుంచి కొత్త అమ్మవారి గుడిలో దసరా మహోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో ఉన్న శ్రీ నగరాల మహాలక్ష్మి (కొత్త అమ్మవారి) దేవస్థానంలో సెప్టెంబర్ 22వ తేదీ నుంచి దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. 22వ తేదీ మహాలక్ష్మీదేవి, 23న బాలా త్రిపుర సుందరీదేవి, 24న గాయత్రీదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న కాత్యాయినీదేవి, 27న శ్రీలలితా త్రిపుర సుందరీదేవి, 28న సంతోషిమాత దేవి, 29న మూలా నక్షత్రం నాడు సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1వ తేదీ మహిషాసురమర్ధినిదేవి, 2న రాజ రాజేశ్వరిదేవిగా అలంకరిస్తారని పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు, కల్యాణ మండప ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంత రావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మాకు రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పించండి

- రిటైర్డ్ పోలీసులు, మృతుల కుటుంబ సభ్యుల వినతి
- పరిష్కరించే విధంగా చర్యలు : డీసీపీ సరిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉద్యోగ విరమణ పొందిన, సర్వీసులో ఉండి మృతి చెందిన పోలీసు కుటుంబాలకు రావాల్సిన బెనిఫిట్స్‌ను సత్వరమే ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు విశ్రాంత పోలీసులు, మృతుల కుటుంబసభ్యులు డీసీపీ కేజీవీ సరితను కోరారు. రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులతో జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాలతో శుక్రవారం రిటైర్డ్ పోలీసులు, సర్వీసులో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులతో డీసీపీ సరిత సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో సుమారు 70 మంది రిటైర్డ్ పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ పోలీసులు మాట్లాడుతూ తమకు రావాల్సిన జీపీఎఫ్, లీవ్ నగదు, జీఐఎస్, పెండింగ్ బిల్స్, ఏపీ జీఎల్ఐ, బీమా, భద్రత, పెన్షన్, కార్పస్‌ఫండ్, కంపెషన్ జాబ్ తదితర బెనిఫిట్స్‌ను సత్వరమే ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అడ్మిన్ డీసీపీ సరితను కోరారు. ఈ సందర్భంగా సరిత సమస్యలకు గల కారణాలను పోలీస్ కమిషనర్ కార్యాలయ పరిపాలనా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా పరిష్కారమార్గాన్ని తెలియజేశారు. రిటైర్డ్ పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసు కమిషనర్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలు తెలియజేయాలని సూచించారు. పోలీసుల సంక్షేమానికి కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలనా విభాగం ఏఓ సునీత, ఏఆర్ ఏడీసీపీ కె.కోటేశ్వరరావు, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు, పరిపాలనా విభాగానికి చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.


రావాల్సిన బెనిఫిట్స్‌పై రిటైర్డ్ పోలీసులతో సమీక్ష జరుపుతున్న డీసీపీ కేజీవీ సరిత

మర్చిపోయిన బ్యాగ్ ప్రయాణికుడికి అందజేత



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలులో బ్యాగు మర్చిపోయి రైలు దిగిపోయిన ప్రయాణికుడికి తిరిగి అందజేసిన ఘటన విజయవాడలో జరిగింది.విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ఇన్‌స్పెక్టర్ జె.వి రమణ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన రాఘవేంద్ర ప్రజాపతి పెయింటింగ్ వర్కు చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 9.20 గంటలకు గుంటూరు స్టేషన్‌లో దిగాడు. అనంతరం చూసుకుంటే తనతో తెచ్చుకున్న బ్యాగును రైలులో మర్చిపోయినట్లు గుర్తించాడు. ఆ బ్యాగులో ఆయన వద్ద పనిచేస్తున్న వారికి జీతాలు చెల్లించేందుకు కావాల్సిన రూ. 1.50 లక్షల నగదు ఉంది. రైలు తరువాత విజయవాడ స్టేషన్‌లో ఆగనుండటంతో వెంటనే విజయవాడ జీఆర్‌పీ పోలీసులను ఫోన్ ద్వారా సంప్రదించి రైలు, బ్యాగు వివరాలు తెలియజేశాడు. వెంటనే స్పందించిన సిబ్బంది విజయవాడలో రైలు ఆగాక అందులో బ్యాగును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ బ్యాగును తెరచి చూడగా అందులో రూ. 1.50 లక్షల నగదు, దుస్తులు ఉన్నాయి. బాధితుడిని పిలిపించి జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జె.వి రమణ నగదును అప్పగించారు. పోయిందనుకున్న నగదును అప్పగించిన జీఆర్‌పీ సిబ్బందికి రాఘవేంద్ర కృతజ్ఞతలు తెలిపాడు.

• దుర్గ గుడిలో భద్రత కట్టుదిట్టం



దుర్గగుడిలో సెల్‌ఫోన్ భద్రపరుస్తున్న భక్తులు

దుర్గగుడిలో భద్రతాచర్యలు కట్టుదిట్టం చేశారు. దుర్గగుడికి వచ్చే భక్తులు సెల్‌ఫోన్‌లను లోపలకి తీసుకువెళ్లనీయకుండా కౌంటర్‌లో భద్రపరుస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల బ్యాగులను తనిఖీ చేసి లోపలకు పంపిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


దుర్గగుడి వద్ద బ్యాగ్‌లను తనిఖీ చేసి లోపలకు పంపిస్తున్న దృశ్యం

విజయవాడ రైల్వేస్టేషన్‌లో మాక్ డ్రిల్


విజయవాడ రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సివిల్ డిఫెన్స్ బృందాలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే, బెనారస్ లోకో వర్క్స్ సివిల్ డిఫెన్స్ బృందాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టే సహాయక చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో సిబ్బంది సకాలంలో స్పందించడం, బాధితులను రక్షించడం, ప్రథమ చికిత్స విధానాలపై అవగాహన కల్పించేలా మాక్ డ్రిల్ చేపట్టారు. మాక్ డ్రిల్‌లో భాగంగా సీపీఆర్, రక్తస్రావం నియంత్రణ, అపస్మారక స్థితిలో ఉన్న బాధితులను సురక్షితంగా కాపాడే ప్రాథమిక లైఫ్ సపోర్టు నైపుణ్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ ఎం.శైలజ, స్టేషన్ మాస్టర్ సాంబశివరావు, దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ (సీడీఐ) టి.సుధీర్‌బాబు, బెనారస్ లోకో వర్క్స్ సీడీఐ సంపూర్ణానంద్ మిశ్రా, ప్రొటోకాల్ ఆఫీసర్ మార్కండేయ మిశ్రా, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తులకు అన్నప్రసాద పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కేఎల్ రావు నగర్ పార్కు రోడ్డులో భక్తులకు అన్న ప్రసాద పంపిణీ జరిగింది. కేఎల్‌రావు నగర్ వీఎంసీ కాలనీలో విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు రాయన నరేంద్ర, టీడీపీ నాయకులు గుర్రం కొండ, జలసూత్రం శ్రీనివాస్ పాల్గొన్నారు. తొలుత స్వామి వారికి అతిథులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేదిక వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కులమతాలకు అతీతంగా స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి ప్రసాదాలను స్వీకరించారు.

ఆకట్టుకున్న చిన్నారుల భువనవిజయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కూరపాటి హైస్కూల్ చిన్నారులు ప్రదర్శించిన భువన విజయం సాహిత్య కార్యక్రమం ఆకట్టుకుంది. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి 163వ జయంతి వేడుకలు కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. తొలుత గిడుగు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. భువనవిజయం సాహితీ రూపకాన్ని ఏడో తరగతి విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధరాచార్య, పాఠశాల కార్యదర్శి కూరపాటి చంద్రశేఖరరావు పాఠశాలలోని తెలుగు ఉపాధ్యాయినులు ఇద్దిపిల్లి దివ్య, తులసిలను సత్కరించారు.

తెలుగు భాషను కాపాడుకుందాం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచీకరణ కారణంగా పరభాషా పదాల వాడుక పెరిగిపోతోందని, ఇలాగే కొనసాగితే తెలుగు వాడకం తగ్గిపోయి మృతభాషగా మారే ప్రమాదం ఉందని కథా రచయిత పొన్నాడ సత్య ప్రకాశరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషను కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి తెలుగువాడిపై ఉందన్నారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా శుక్రవారం విద్యాధరపురం లేబర్‌కాలనీలోని గొల్లపల్లి నాగేశ్వరరావు మున్సిపల్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రచయిత సత్య ప్రకాశరావును సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ నిర్వహించిన కార్యక్రమంలో సీహెచ్ శర్మ, పాణిగ్రాహి రాజశేఖర్, కోపూరి పుష్పాదేవి, వేలూరు సుధారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్డె వెంకట రవికుమార్, తెలుగు ఉపాధ్యాయులు జమీలా భాను, ఉదయ్ కిరణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. చిన్నారి రామన్ గిడుగు రామమూర్తి పంతులు వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మాతృభాష అత్యంత శక్తిమంతమైనది



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సంక్లిష్టమైన సాంకేతిక, శాస్త్రీయ భావనలను వ్యక్తీకరించగల అత్యంత శక్తివంతమైనది మాతృభాష అని ప్రముఖ శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, అధ్యాపకుడు డాక్టర్ భానుశేఖర్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్య నగర్ సెక్షన్ 33/11 కేవీ హెడ్ వాటర్ వర్క్స్ విద్యుత్ ఉప కేంద్రంలో 11 కేవీ కుమ్మరిపాలెం ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతో పాటు మెయింటెనెన్స్ పనులు కూడా చేపట్టనున్నందున శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు డీఎస్ఎంపీ హైస్కూల్ ఏరియా, కొట్టేటి కోటయ్య వీధి, కుమ్మరిపాలెం సెంటర్, రావి చెట్టు సెంటర్, గుప్తా సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, ఉప్పు గోడౌన్, సిమెంట్ రోడ్ సెంటర్, పెద్ద సాయిబాబా గుడి ఏరియా తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి

వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీలో నూతన పదవులు పొందిన నేతలకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన కామరాజ్ హరీష్ కుమార్ ఆచారి, పార్టీ ఇంటలెక్చువల్ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బెవర నాగేశ్వరరావు, మైనార్టీ క్రిస్టియన్ విభాగ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులైన నక్కా ప్రభుదాస్, జిల్లా కార్యదర్శిగా నియమితులైన నాగోతి గురురాం ప్రసాద్ తదితరులు శుక్రవారం వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తేవాలని, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆంజనేయరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వెలంపల్లికి కృతజ్ఞతలు తెలుపుతున్న హరీష్‌కుమార్

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శుద్ధ షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్లకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం నుంచి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా కళావేదిక వద్దకు తీసుకువచ్చారు. కళావేదికపై ఆలయ వైదిక కమిటీ, స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణోత్సవంలో ఆలయ ఈవో శీనానాయక్, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి కల్యాణ తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. షష్ఠినాడు ఆలయంలో నిర్వహించే స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నా, కల్యాణోత్సవాన్ని వీక్షించిన భక్తులకు సకల శుభాలు కలుగుతాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. వివాహం ఆలస్యం అవుతున్న వారికి దోషాలు తొలగిపోతాయని, సంతానం లేని వారికి సంతాన భాగ్యాన్ని స్వామి వారు ప్రసాదిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.


స్వామి వారి కల్యాణాన్ని జరిపిస్తున్న ఆలయ అర్చకులు

మిథిలానగర్ చవితి పూజల్లో మహిళల పారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా రోడ్‌లో మిథిలానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళా భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. తొలుత గణనాధునికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. చివరి రోజున ఉదయం 5.30 గంటలకు శ్రీలక్ష్మీ గణపతి హోమం, అనంతరం వినాయకునికి ప్రత్యేక పూజలు, 11.30 గంటలకు స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు మేళతాళాల నడుమ స్వామివారిని కాలనీ వీధులలో ఊరేగిస్తామని, అనంతరం కృష్ణానదిలో నిమజ్జన కార్యక్రమం ఉంటుందని వివరించారు. ప్రతి రోజు స్వామివారికి పూజలు, సాయంత్రం కాలనీవాసులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.


వినాయక చవితి పందిరిలో విష్ణు సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు

శ్రీ వాంఛకల్పలతా గణపతిగా బాలగణపతి దర్శనం


శ్రీ వాంఛకల్పలతా గణపతిగా బాలగణపతి


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

- నేత్రపర్వంగా వాహన సేవ
- శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ బాల గణపతి స్వామి వారు శ్రీ వాంఛకల్పలతా గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్తీ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయంలో స్వామి వారి వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామి వారి సన్నిధిలో శుక్రవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం సహస్రనామార్చన నిర్వహించారు. స్వామి వారికి సహస్ర మోదక (ఉండ్రాళ్ళ) పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారికి చేసిన అలంకారం చూడముచ్చటగా ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామి వారి వాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవాయిద్యాలు, స్వామి వారి నామకీర్తనలతో వాహన సేవను నిర్వహించారు. పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన

ఆర్యవైశ్య కల్యాణమండపం ప్రాంగణంలో అమ్మవారికి సామూహిక లక్షకుంకుమార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. లలితా సహస్ర నామాలతో అర్చనను వైభవంగా నిర్వహించారు. సహస్ర అష్ట కేజీల తండువాలతో (బియ్యం)తో అమ్మవారికి అభిషేకాన్ని నిర్వహించారు. పూజలో పాల్గొన్న వారికి నిర్వాహకులే పూజా సామగ్రి, ఇతర నివేదన వస్తువులను అందించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆతుకూరి శ్రీదేవి పర్యవేక్షించారు. సాయంత్రం మణిదీప వర్ణన పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మామిడి శివపార్వతి, కారుమూరి వెంకటేశ్వరరావు, మారేమళ్ల సుధాకర్ పాల్గొన్నారు.

మాతృభాషతోనే మనోవికాసం

విజయవాడ కల్చరల్: మాతృభాషతోనే మనోవికాసం కలుగుతుందని కామ్రేడ్ పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణ రావు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళా భారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి, పద్మశ్రీ ఘంటసాల చైతన్యవేదిక ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగు భాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నారాయణ రావు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి సాహితీ సంస్థలు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో తెలుగులోనే బోధన సాగాలన్నారు. చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, కె.డేవిడ్‌రాజు, కోట వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలుగుతల్లి విగ్రహం వద్ద మాతృభాషాభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.